అక్షరశక్తి
The Power of Pen
Evening Daily

సంపుటి: 20 | సంచిక: 330 | వరంగల్ | శుక్రవారం, 09 అక్టోబర్ 2026 | పేజీలు: 07

రామప్పకు ముప్పు!

రామప్ప ఆలయానికి సమీపంలో సింగరేణి ఓపెన్‌కాస్ట్ గని

ములుగు జిల్లా, వెంకటాపూర్ మండలంలోని పాలంపేటలో కాకతీయులు నిర్మించిన చారిత్రక దేవాలయం రామప్ప (రుద్రేశ్వర ఆలయం). కాకతీయులు నిర్మించిన ఆలయాల్లో రామప్ప అత్యద్భుతం. ఆ నాటి ఇంజినీరింగ్, శిల్ప కళా నైపుణ్యానికి నిలువెత్తు నిదర్శనం. సుమారు క్రీస్తు శకం 1213 సంవత్సరంలో ప్రారంభించి, 40 ఏళ్లపాటు దీనిని నిర్మించారు. రామప్ప ఆలయం యునెస్కో(UNESCO) గుర్తింపు పొంది, మన ఓరుగల్లు కీర్తిని విశ్వవ్యాప్తం చేసింది. ఆలయానికి సమీపంలోనే నిర్మించిన రామప్ప చెరువు 8 శతాబ్దాలుగా సాగునీరు అందిస్తోంది. ప్రత్యక్షంగా 30వేల ఎకరాలు, పరోక్షంగా మరో 50వేల ఎకరాలు.. అంటే మొత్తం సుమారు 80వేల ఎకరాలకు సాగునీరు అందిస్తోంది. ఇంత గొప్ప వారసత్వ సంపద నేడు ప్రమాదంలో పడిపోతోంది. సింగరేణి కాలరీస్ చేపడుతున్న ఓపెన్ కాస్ట్ గనితో ధ్వంసంకాబోతోంది. చూస్తుండగానే రామప్ప ఆలయం, రామప్ప చెరువు కనుమరుగయ్యే పరిస్థితుల్లో పడిపోతోంది.. అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు కాకతీయ హెరిటేజ్ ట్రస్టీ, ఇన్‌టాక్(INTACH) వరంగల్ చాప్టర్ కన్వీనర్, వరంగల్ నిట్(NITW) రిటైర్డ్ ప్రొఫెసర్ ఎం. పాండురంగారావు. ఆలయానికి కేవలం ఐదు కిలోమీటర్ల దూరంలోనే సింగరేణి కాలరీస్ చేపడుతున్న ఓపెన్‌కాస్ట్ మైన్‌తో రామప్ప ఆలయంతోపాటు రామప్ప చెరువుకు ప్రమాదం పొంచి ఉందంటూ ఆయన హెచ్చరిస్తున్నారు. ఓపెన్ కాస్ట్ మైన్ ఆపివేయాలంటూ 85ఏళ్ల వయస్సులోనూ ఆయన పోరాడుతున్నారు. ఈ నేపథ్యంలోనే డిజిటల్ మీడియా ప్రతినిధులతో పాండురంగారావు ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే... - *అక్షరశక్తి, ప్రధానప్రతినిధి*



SPECIAL PAGE

- ఐదు కిలోమీటర్ల దూరంలో 300 మీటర్ల లోతు బొగ్గు తవ్వకాలు
- యునెస్కో గుర్తింపు పొందిన చారిత్రక ఆలయంపై ఓపెన్‌కాస్ట్ నీడ
- భూగర్భజలాల మార్పులతో చెరువు కట్టకు ప్రమాదం?
- పునాదుల్లో ఇసుక కొట్టుకుపోతే ఆలయ స్థిరత్వానికి ముప్పు
- 80 వేల ఎకరాల సాగు.. వేలాది కుటుంబాల జీవనాధారంపై ఆందోళన
- రానున్న కాలంలో కంటికి కనిపించని జీవన విధ్వంసమే..
- ప్రభుత్వాలు స్పందించాలి.. గనిని నిలిపివేయాలి
- ప్రొఫెసర్ పాండురంగారావు



ఆర్ట్స్ కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

మహిళలు హక్కులను తెలుసుకొని ధైర్యంగా ముందుకు సాగాలి: మహిళా కమిషన్ అధ్యక్షురాలు నేరెళ్ల శారద

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, ఆత్మీయతకు నిదర్శనమని రాష్ట్ర మహిళా కమిషన్ అధ్యక్షురాలు నేరెళ్ల శారద అన్నారు. శుక్రవారం కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, మహిళలు విద్యార్థి దశ నుంచే తమ హక్కులు, బాధ్యతలపై అవగాహన పెంపొందించుకొని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. మహిళలపై జరుగుతున్న దాడులు, అక్రత్యాలు ఆందోళన కలిగిస్తున్నాయని, మహిళలకు కుటుంబంలోనూ, సమాజంలోనూ భద్రత కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. - *అక్షరశక్తి,హనుమకొండ*



ఆర్టీఎఫ్ఎంఎస్‌లో కరీంనగర్ సర్కిల్ వంద శాతం పూర్తి

- 82 సబ్‌స్టేషన్ల స్కాడా అనుసంధానం..
- మరో రెండు నెలల్లో మిగతా సబ్‌స్టేషన్లలో పనులు పూర్తి



అక్షరశక్తి,హనుమకొండ: టీజీ ఎన్‌పీడీసీఎల్ పరిధిలో రియల్‌టైమ్ ఫీడర్ మానిటరింగ్ సిస్టమ్ (ఆర్టీఎఫ్ఎంఎస్) అమలులో కరీంనగర్ సర్కిల్ తొలి సర్కిల్‌గా 100 శాతం లక్ష్యాన్ని సాధించిందని సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. కరీంనగర్ సర్కిల్ పరిధిలోని 82 సబ్‌స్టేషన్లను స్కాడాతో అనుసంధానం పూర్తి చేసినట్లు వెల్లడించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తగ్గించడం, ఫీడర్ల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం, సమస్యలను వేగంగా గుర్తించి పరిష్కరించడం ద్వారా వినియోగదారులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే ఈ ఆధునిక సాంకేతిక వ్యవస్థ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క మార్గదర్శకత్వంలో, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిత్తల్ సహకారంతో ఈ వ్యవస్థను విస్తరిస్తున్నట్లు తెలిపారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

3-27 యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇనుగాల శ్రీధర్

అక్షరశక్తి,హనుమకొండ: విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం 327 యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇనుగాల శ్రీధర్ తెలిపారు. శుక్రవారం హనుమకొండ వడ్డేపల్లిలోని పల్లా రవీందర్‌రెడ్డి భవనంలో ఆర్టిజన్ కార్మికుల ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఆర్టిజన్ ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా కొన్ని నిబంధనలు వర్తింపజేసేలా కృషి చేసినందుకు కృతజ్ఞతగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇనుగాల శ్రీధర్ మాట్లాడుతూ, కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా ఎన్నో ఏళ్లుగా చేసిన పోరాటాల ఫలితంగా ఆర్టిజన్ ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా కొన్ని సదుపాయాలు కల్పించేందుకు యాజమాన్యం అంగీకరించి, సంబంధిత సమావేశపు నిర్ణయాలను విడుదల చేసిందన్నారు. రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగా సెలవుల అనుమతులు, వైద్య సదుపాయాలు, వైద్య కారణాలతో అనర్హతకు సంబంధించిన ప్రయోజనాలు కల్పించే అంశాలపై త్వరలోనే ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందని వివరించారు. అన్‌మ్యాన్‌డ్ కార్మికుల సమస్యలను సైతం ప్రభుత్వం, యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే వారికి కూడా శుభవార్త అందేలా కృషి చేస్తామని తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలే మార్గమని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో 327 యూనియన్ కంపెనీ అధ్యక్షుడు పి. మహేందర్‌రెడ్డి, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి చింతలపూడి సతీష్‌కుమార్, కార్పొరేట్ కార్యాలయ యూనియన్ నాయకులు నరేష్, రాంబాబు, డివిజన్ నాయకుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



పద్మాక్షి దేవస్థానంలో శరన్నవరాత్రి మహోత్సవాలు

- 21న రథోత్సవం..
- 22న పద్మాక్షి దేవి శాంతి కల్యాణం, తెప్పోత్సవం



అక్షరశక్తి, హనుమకొండ: హనుమకొండలోని ఏకశిలా నగరంలో వెలసిన శ్రీ హనుమద్గిరి పద్మాక్షి దేవస్థానంలో ఈ నెల 11వ తేదీ నుంచి 22వ తేదీ వరకు శరన్నవరాత్రి మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో మహోత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ నెల 11వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు జ్యోతి ప్రజ్వలనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. హనుమకొండ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, నీలిమ దంపతులు, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) చైర్మన్ గుండు సుధారాణి, ప్రభాకర్, దేవాలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొననున్నారు. బ్రహ్మశ్రీ నాగిళ్ల షణ్ముఖ పద్మనాభ అవధాని ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ సుప్రభాతం, అభిషేకం, అమ్మవారి అలంకరణ, ఉపనిషత్తుల పారాయణం, చండీ సప్తశతి, నవగ్రహ రుద్ర హవనాలు, లలితా శాస్త్ర పారాయణం, చతుర్వేద స్వస్తి, హారతి, మంత్రపుష్పం, భగవద్గీత పారాయణం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. తొమ్మిది రోజులపాటు అమ్మవారిని శైలపుత్రి, బ్రహ్మచారిణి, చంద్రఘంట, కూష్మాండ, స్కందమాత, కాత్యాయనీ, కాళరాత్రి, మహాగౌరి, సిద్ధిదాత్రి రూపాల్లో అలంకరించి పూజలు నిర్వహిస్తారు. ఐదో రోజు ఉపాంగ లలితా వ్రతం, లక్ష పుష్పార్చన నిర్వహించనున్నారు. ఎనిమిదో రోజు దుర్గాష్టమి, సద్దుల బతుకమ్మ వేడుకతో పాటు రాత్రి 12 గంటలకు కాళరాత్రి హవనం నిర్వహిస్తారు. తొమ్మిదో రోజు మహార్నవమి సందర్భంగా సుహాసిని పూజ, మహాపూర్ణాహుతి, ఋత్విక్కుల సన్మానం జరగనున్నాయి. పదో రోజు అపరాజితా దేవి అలంకరణ, విజయదశమి వేడుకలు, ఆయుధ పూజ నిర్వహిస్తారు. ఈ నెల 21వ తేదీ బుధవారం సాయంత్రం 6 గంటలకు మహాస్నపనం అనంతరం రథోత్సవం, ఉత్సవమూర్తి ఊరేగింపు నిర్వహిస్తారు. 22వ తేదీ గురువారం ఉదయం 10.30 గంటలకు పద్మాక్షి దేవి శాంతి కల్యాణం, సాయంత్రం పద్మాక్షి తటాకంలో తెప్పోత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అభివృద్ధి కార్యకర్త నీలారపు రాజ్‌కుమార్, ప్రచార కార్యదర్శి కనుకుంట్ల రవికుమార్, దేవాలయ అభివృద్ధి కార్యకర్త మునుగోటి రమేష్, గోవర్ధన వెంకట రమణాచారి తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ లో నర్సరీ తొలగించాలని ఆదేశం

- చెట్ల నరికివేతపై అటవీ శాఖ చర్యలు
- జరిమానా చెల్లించాలని సూచన
- అక్షరశక్తి కథనానికి స్పందన

అక్షరశక్తి,కేయూ క్యాంపస్: కాకతీయ విశ్వవిద్యాలయం రెండో గేటు సమీపంలో, టీబీ ఆసుపత్రి ఎదురుగా నర్సరీ నిర్వహిస్తున్న ప్రాంతంలో చెట్ల నరికివేతపై 'అక్షరశక్తి' దినపత్రికలో గురువారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శుక్రవారం కాకతీయ విశ్వవిద్యాలయ అధికారులు, అవెన్యూ ప్లాంటేషన్ ఇన్‌చార్జి బట్టి గోపినాథ్ నర్సరీ వద్దకు వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. నర్సరీ నిర్వహణకు అనుమతులు ఉన్నాయా? చెట్లను ఎందుకు నరికివేశారని యజమానిని ప్రశ్నించారు. ఇకపై అక్కడ నర్సరీ కొనసాగించకూడదని, మూడు రోజుల్లోగా తొలగించాలని సూచించారు. ఆ ప్రాంతంలో కాకతీయ విశ్వవిద్యాలయం ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. నిర్మాణ పనుల వల్ల నర్సరీలోని మొక్కలు దెబ్బతింటే అందుకు తాము బాధ్యత వహించబోమని స్పష్టం చేసినట్లు తెలిసింది.

మరోవైపు, చెట్ల నరికివేత విషయం అటవీ శాఖ అధికారుల దృష్టికి వెళ్లడంతో అటవీ బీట్ అధికారి శారద నర్సరీ వద్దకు చేరుకున్నారు. చెట్లను ఎందుకు నరికివేశారని యజమానిని ప్రశ్నించడంతో పాటు, నర్సరీని అక్కడి నుంచి తొలగించాలని సూచించారు. చెట్ల నరికివేతకు సంబంధించి అటవీ కార్యాలయానికి వచ్చి జరిమానా చెల్లించాలని ఆదేశించారు. దీనికి నర్సరీ యజమాని అంగీకరించినట్లు తెలిసింది.



బహుజనులు రాజ్యాధికారంలోకి రావడమే కాన్షీరామ్‌కు నిజమైన నివాళి



అక్షరశక్తి, హనుమకొండ: తెలంగాణలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన బహుజనులు రాజ్యాధికారంలోకి రావడమే మాన్యశ్రీ కాన్షీరామ్‌కు అర్పించే నిజమైన నివాళి అని ప్రముఖ వైద్యుడు డా. సినపెల్లి విజయ్ అన్నారు. బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ (బీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం హనుమకొండలోని ఒకేషనల్ జూనియర్ కళాశాలలో కాన్షీరామ్ 20వ వర్ధంతి సభను జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డా. విజయ్ తొలుత కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గౌతమ బుద్ధుడు, మహాత్మా జ్యోతిరావు ఫూలే, ఛత్రపతి సాహు మహారాజ్, పెరియార్ రామస్వామి నాయకర్, డా. బీఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సమసమాజ స్థాపన కోసం కాన్షీరామ్ కృషి చేశారని కొనియాడారు. బహుజన సమాజ్ పార్టీ స్థాపన ద్వారా దళిత, బహుజన వర్గాలకు రాజకీయ అధికారాన్ని సాధించే మార్గాన్ని చూపారని పేర్కొన్నారు. అంబేద్కర్ రచించిన 'కుల నిర్మూలన' పుస్తకం ప్రభావంతో బహుజన చైతన్యానికి నడుం బిగించిన ఆయన దేశవ్యాప్తంగా పర్యటించి, ఉత్తరప్రదేశ్‌లో బహుజన రాజకీయాలకు బలమైన పునాది వేశారని అన్నారు. మాయావతిని ముఖ్యమంత్రిని చేయడంలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. బహుజనులు రాజకీయంగా ఐక్యమై అధికారాన్ని సాధించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఎస్ఎఫ్ నాయకులు కదారపు నవీన్, రత్న భాస్కర్, బొట్ల అజయ్, భాషిపాక తరుణ్, కొంకి రామకృష్ణ, ఇనుగాల బిక్షపతి, కోటేశ్వర్, రవితేజ, నందకుమార్, మేఘన, శిరీష, అఖిల, సమత, పావని, తేజస్విని, పవన్, శ్రీధర్, రాకేష్, సందీప్‌తో పాటు వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు.

పల్లెసీను పుస్తకావిష్కరణల ఉత్సవం

- సహస్ర చంద్ర దర్శన వేళ మహోత్సవం
- అక్టోబర్ 11న హరిత కాకతీయలో సాహిత్య వేడుక

అక్షరశక్తి, హనుమకొండ: శ్రీలేఖ సాహితి,వరంగల్లు స్వర్ణోత్సవ సంవత్సరాన్ని పురస్కరించుకొని, పల్లెసీను సహస్ర చంద్ర దర్శన వేళ పుస్తకాల ఆవిష్కరణ మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం అక్టోబర్ 11 ఆదివారం ఉదయం 10 గంటల నుంచి నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో జరుగుతుందని శ్రీలేఖా సాహితి అధ్యక్షులు టీ. శ్రీరంగ స్వామి తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత, శ్రీ లేఖా సాహితి ఉపాధ్యక్షులు పల్లె సీను రచించిన గగన తరంగాలు, మైత్రీ భావ తరంగాలు, పల్లె అంతరంగం, నేను కవిత్వాన్ని, నా సాహిత్య సంబంధాలు పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.ఈ ఆవిష్కరణ మహోత్సవంలో డా.దహగాం సాంబమూర్తి, ఐతా చంద్రయ్య, డా. మడత భాస్కర్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు డా రియాజ్, కందుకూరి శ్రీరాములు, ఒద్దిరాజు ప్రవీణ్





కుమార్, డా. పర్చా అంజనీదేవి, టి. ఉడయవర్లు,డా. అమ్మిన శ్రీనివాసరాజు, రచయిత, సీనియర్ జర్నలిస్ట్ శంకేశి శంకర్రావు, వరిగొండ కాంతారావు , డా. వూరె సత్యవాణి, డా. ఎన్ వి ఎన్ చారి, గుడిపాటి, డా. పల్లేరు వీరా స్వామి తదితరులు పాల్గొంటారు.కావున సాహితీ మిత్రులు, అభిమానులు పాల్గొనాలని తెలిపారు.





ఆర్ట్స్ కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- మహిళలు హక్కులను తెలుసుకొని ధైర్యంగా ముందుకు సాగాలి: మహిళా కమిషన్ అధ్యక్షురాలు నేరెళ్ల శారద

అక్షరశక్తి,హనుమకొండ: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, ఆత్మీయతకు నిదర్శనమని రాష్ట్ర మహిళా కమిషన్ అధ్యక్షురాలు నేరెళ్ల శారద అన్నారు. శుక్రవారం కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, మహిళలు విద్యార్థి దశ నుంచే తమ హక్కులు, బాధ్యతలపై అవగాహన పెంపొందించుకొని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. మహిళలపై జరుగుతున్న దాడులు, అకృత్యాలు ఆందోళన కలిగిస్తున్నాయని, మహిళలకు కుటుంబంలోనూ, సమాజంలోనూ భద్రత కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. మహిళల హక్కుల పై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర మహిళా కమిషన్ ఆధ్వర్యంలో వంద రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని ఆర్ట్స్



కళాశాల నుంచే ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. బాలికలకు స్వీయరక్షణ శిక్షణ అందించడంతోపాటు, మహిళలను గౌరవించే సంస్కృతిని చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో పెంపొందించాలని పిలుపునిచ్చారు.

ఆదర్శంగా నిలిచిన ఆదర్శ కాలనీ కుటుంబం

అక్షరశక్తి, హనుమకొండ: నయీంనగర్‌లోని 53వ డివిజన్ ఆదర్శ కాలనీకి చెందిన పైడిపాల రమేష్-కవిత కుటుంబ సభ్యులందరూ నేత్రదానానికి అంగీకార పత్రాలను శుక్రవారం తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్ హనుమకొండ జిల్లా విభాగానికి అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పరికిపండ్ల వేణు మాట్లాడుతూ, ఒకరి నేత్రదానం ఇద్దరు అంధులకు చూపునిస్తుందని తెలిపారు. గతంలోనే కవిత మరణానంతరం వైద్య కళాశాలకు శరీరదానం చేసేందుకు అంగీకారం తెలిపారని పేర్కొన్నారు. ఈ కుటుంబాన్ని ఆదర్శంగా తీసుకొని మరింత మంది నేత్రదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాశం సంజీవరెడ్డి, పైడిపాల రమేష్, మర్రిపెల్లి కవిత, సృజనశ్రీ, అజితేష్ మిత్ర తదితరులు పాల్గొన్నారు.





ప్రగతి హైస్కూల్‌లో ఘనంగా వన్యప్రాణుల వారోత్సవం

అక్షరశక్తి,వరంగల్: వన్యప్రాణుల వారోత్సవం సందర్భంగా వరంగల్ కొత్తవాడలోని ప్రగతి హైస్కూల్, కర్ణాటకకు చెందిన వన లోక ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో "ప్రకృతి అన్వేషకులు - ప్రకృతిలో సమాచార మార్పిడి" అనే అంశంపై ప్రత్యేక అవగాహనా కార్యశాల నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్, కౌన్సిలింగ్ సైకాలజిస్ట్ చందర్ బాబు నందాల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఐక్యరాజ్యసమితి వనరుల కేంద్రం - ఈశాన్య ప్రాంతం తెలంగాణ రాష్ట్ర సమన్వయకర్త ధర్మపురి రాజగోవిందు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ప్రకృతి, వన్యప్రాణులు, జీవ వైవిధ్యం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ప్రకృతిని పాఠ్యపుస్తకాలకే పరిమితం చేయకుండా ప్రత్యక్ష అనుభవాల ద్వారా అర్థం చేసుకోవాలని, చిన్న వయస్సు నుంచే పర్యావరణ పరిరక్షణపై బాధ్యత పెంపొందించుకోవాలని చందర్ బాబు నందాల సూచించారు.

చేగువేరా పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి

పి.డి.ఎస్.యూ. రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. నరసింహారావు



అక్షరశక్తి, మహబూబాబాద్: దేశంలో మతోన్మాద ఫాసిజానికి, ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొనసాగిస్తున్న సామ్రాజ్యవాద యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా విద్యార్థులు, యువత చేగువేరా పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. నరసింహారావు పిలుపునిచ్చారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఆధ్వర్యంలో శుక్రవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ప్రపంచ పోరాట యోధుడు ఎర్నెస్టో చేగువేరా 59వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నరసింహారావు మాట్లాడుతూ.. సామ్రాజ్యవాద దోపిడీ, అగ్రరాజ్యాల ఆధిపత్యానికి వ్యతిరేకంగా చేగువేరా చేసిన పోరాటాలు, త్యాగాలు నేటి తరం విద్యార్థులు, యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా పేదలందరికీ నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందించాలని, కుల, మత, ఆర్థిక అసమానతలు లేని సమాజ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. చేగువేరా వర్ధంతిని సామ్రాజ్యవాద వ్యతిరేక దినంగా పాటించాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య, లౌకిక, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం జెన్ జీ విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల్లో ఢిల్లీ తరహా జంతర్‌మంతర్ ఉద్యమాలను చేపట్టి కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రశ్నించాలని అన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు బానోత్ నందీశ్వర్, జిల్లా నాయకులు సాయి చరణ్, నవీన్, రామ్, ప్రకాశ్, మోహన్, మహేష్, రాజేందర్, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

మెస్ రెన్యూవల్ ఫీజు రూ.500 వసూలు చేయడం అన్యాయం



అక్షరశక్తి, హనుమకొండ: కాకతీయ యూనివర్సిటీ ఇంజినీరింగ్ విద్యార్థుల మెస్ రెన్యూవల్ కోసం నిర్ణీత రూ.100కు బదులుగా ఒక్కొక్కరి నుంచి రూ.500 వసూలు చేయడాన్ని నిరసిస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శుక్రవారం యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బి. వంశీకృష్ణ మాట్లాడుతూ.. మెస్ రెన్యూవల్ పేరుతో విద్యార్థుల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేయడం అన్యాయమని అన్నారు. అదనపు వసూళ్లను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థుల నుంచి వసూలు చేసిన అదనపు మొత్తాన్ని వెంటనే తిరిగి చెల్లించాలని, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మెస్ రెన్యూవల్ కోసం నిర్ణీత రూ.100 మాత్రమే వసూలు చేయాలని కోరారు. అధికారులు స్పందించకపోతే అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు శివ, పవిత్ర, నికిత, అఖిల, మహేశ్వరి, సాగర్, విద్వాన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.





పాత్రికేయుల సేవలు విశిష్టమైనవి

- సమాచార శాఖ అదనపు సంచాలకులు డీ ఎస్ జగన్
- పాత్రికేయులకు లయన్స్ ఘన సన్మానం
- లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా 320ఎఫ్ ఆధ్వర్యంలో కార్యక్రమం

అక్షరశక్తి, హనుమకొండ: సమాజంలో పాత్రికేయుల(జర్నలిస్ట్) సేవలు చాలా విలువైనవనీ, వారి సేవలను గుర్తించి, సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ వారికి అభినందనలు అని రాష్ట్ర సమాచార, ప్రజా సంబంధాల శాఖ అదనపు సంచాలకుడు డి.ఎస్. జగన్ అన్నారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా 320ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో పాత్రికేయుల సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.బస్టాండ్ సమీపంలోని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జగన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా లో ఏపీఆర్వో గా, సుదీర్ఘ కాలం డిపీఆర్వో గా చేసిన అనుభవం ఉంది అని అన్నారు. ఇక్కడి జర్నలిస్ట్ మిత్రులు తెలిసినంత గా మరెక్కడా తెలియదని అన్నారు. వరంగల్ లో పని చేసిన కాలంలో ఎన్నో గొప్ప జ్ఞాపకాలు ఉన్నాయని సమాచార శాఖ సంయుక్త సంచాలకుడు కె. వెంకట రమణ అన్నారు. లయన్స్ విశిష్ట అతిథులుగా వచ్చిన వెంకటరమణ మాట్లాడుతూ పౌర సంబంధాల అధికారిగా ప్రతీ జర్నలిస్ట్ తో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని అన్నారు. చాలా సార్లు మేడారం జాతరలో పాల్గొన్నానని, ఆ సందర్భంగా పాత్రికేయులు, అధికారులతో చాలా మధురస్మృతులు చాలా ఉన్నాయని అన్నారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 53 మంది సీనియర్ జర్నలిస్ట్ లకు శాలువా, మెమెంటో తో ఘనంగా సత్కరించారు. ఈ పాత్రికేయుల సన్మాన కార్యక్రమం నిర్వహణ బాధ్యతలను లయన్ పి.వి. మదన్ మోహన్ చేపట్టగా, గౌరవ అతిథులుగా లయన్ డాక్టర్ కె. చంద్రశేఖర్ ఆర్య, లయన్ పి. హరికిషన్ రెడ్డి, లయన్ రేవూరి రమణ రెడ్డి, మాజీ జిల్లా గవర్నర్లు ముచ్చ రాజిరెడ్డి, ఎన్. వెంకటేశ్వర్ రావు, కన్న పరశురాములు, జిల్లా క్యాబినెట్ కార్యదర్శి లయన్ పాము శ్రీనివాస్, హనుమకొండ ప్రాంతం నుంచి లయన్ తాడూరి రేణుక, కాజీపేట ప్రాంతం నుంచి లయన్ డి. వెంకటసుబ్బయ్య, వరంగల్ ప్రాంతం నుంచి లయన్ పబ్బా చంద్ర మోహన్, సుబేదారి ప్రాంతం నుంచి లయన్ బిల్లా సులోచన, తొర్రూరు ప్రాంతం నుంచి లయన్ డాక్టర్ ఎస్. నాగవాణి, జనగామ ప్రాంతం నుంచి లయన్ జైన రమేష్ జిల్లా క్యాబినెట్ కోశాధికారి లయన్ చొప్పాటి సోమయ్య, జిల్లా కార్యక్రమాల సమన్వయకర్త లయన్ టి. నరేందర్, ప్రజాసంబంధాల అధికారి లయన్ డి. అజిత్ కుమార్‌తో పాటు వివిధ విభాగాల సమన్వయకర్తలు, జోన్ చైర్‌పర్సన్లు కార్యక్రమ నిర్వహణలో భాగస్వాములు అయ్యారు.సమావేశాల నిర్వహణ, వ్యాఖ్యాతగా లయన్ పి. వేణుమాధవ్ రావు వ్యవహరించగా హనుమకొండ లయన్స్ క్లబ్ వెయ్యి స్తంభాల ఆలయం శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది.







కేయూ ఫిజిక్స్ విభాగంలో బతుకమ్మ సంబరాలు





అక్షరశక్తి, హనుమకొండ: కాకతీయ విశ్వవిద్యాలయంలోని భౌతిక శాస్త్ర విభాగంలో బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రం వేడుకలను ప్రారంభించారు. విభాగాధిపతి డా. జి. పద్మజ ఆహ్వానం మేరకు తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యులు నూనావత్ రాధా, సదాలక్ష్మి, చిట్యాల ఐలమ్మ కోడలు చిట్యాల శ్వేత ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రామచంద్రం మాట్లాడుతూ.. తెలంగాణలో మహిళలు అత్యంత వైభవంగా జరుపుకునే బతుకమ్మ పండుగ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. విభాగాధిపతి డా. పద్మజ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ వెనుక ఉన్న శాస్త్రీయ అంశాలను వివరించారు. అనంతరం అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ, ఆటపాటలతో ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఉత్సవాలు సందడిగా సాగాయి.

దళిత మహిళపై దాడి చేసిన అమర్నాథ్ గౌడ్‌ను అరెస్టు చేయాలి

స్వేరో స్టూడెంట్స్ యూనియన్ డిమాండ్

అక్షరశక్తి, హనుమకొండ: నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గం చింతపల్లి మండలం పీకే మల్లేపల్లి గ్రామంలో దళిత మహిళ మాధవిపై కులం పేరుతో దూషణలకు దిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అమర్నాథ్ గౌడ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కాకతీయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పీకే మల్లేపల్లి గ్రామంలో గ్రామ సంస్థ సహాయకురాలిగా (వీఓఏ) విధులు నిర్వహిస్తున్న నాగినిపల్లి మాధవి గ్రామసభ సందర్భంగా సంఘాల డబ్బుల వివాదంపై గ్రామపంచాయతీ వద్ద ప్రశ్నించగా, మాజీ సర్పంచ్ భర్త అమర్నాథ్ గౌడ్ ఆమెను కులం పేరుతో దూషించి, దాడికి పాల్పడినట్లు ఆరోపించారు. ఈ ఘటనపై ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధితురాలికి న్యాయం చేయాలని కోరారు. భాధ్యుడిని అరెస్టు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, దీక్షలు, రాస్తారోకోలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్వేరో స్టూడెంట్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు చెట్టుపల్లి శివకుమార్, నాయకులు శ్రీనాథ్, శ్రావణ్, నాగరాజు, మహేష్, శ్రీకాంత్, ఉదయ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మ

తెలంగాణ జీవన సంస్కృతికి ప్రతీక

అచ్చమైన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ప్రకృతితో మమేకమైన జీవన విధానానికి బతుకమ్మ పండుగ ఒక అద్భుతమైన ప్రతీక. ప్రకృతి ప్రేమతో ఇచ్చిన పూలతో పేర్చిన బతుకమ్మ చుట్టూ మహిళలు సామూహికంగా పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ, నృత్యాలు చేస్తూ జరుపుకునే ఈ పండుగ కేవలం ఆధ్యాత్మిక వేడుక మాత్రమే కాదు.. తెలంగాణ ప్రజల సామాజిక జీవనం, స్త్రీ శక్తి, ప్రకృతి ప్రేమ, వ్యవసాయ సంస్కృతి, నీటి వనరుల పరిరక్షణ వంటి అనేక అంశాలను తనలో ఇముడ్చుకున్న ప్రత్యేకమైన సాంస్కృతిక వారసత్వం. తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక సమాచారం కూడా బతుకమ్మకు చారిత్రక, పర్యావరణ, సామాజిక, ఆధ్యాత్మిక ప్రాధాన్యతలు ఉన్నాయని పేర్కొంటోంది.

ప్రకృతి ఒడిలో పుట్టిన పూల పండుగ...

వర్షాకాలం ముగిసి శరదృతువు ప్రారంభమయ్యే సమయంలో తెలంగాణ పల్లెల్లో, పొలాల గట్లపై, బీడు భూముల్లో తంగేడు, గునుగు, బంతి, చామంతి, నందివర్ధనం తదితర పూలు విరివిగా పూస్తాయి. ఈ సహజ పుష్ప సంపదనే బతుకమ్మలో ప్రధానంగా ఉపయోగించడం తెలంగాణ ప్రజల ప్రకృతితో ఉన్న అనుబంధానికి నిదర్శనం. ముఖ్యంగా తంగేడు, గునుగు పూలు బతుకమ్మకు ప్రత్యేక గుర్తింపుగా నిలిచాయి. బతుకమ్మను పూలను వరుసలుగా పేర్చి, గోపురాకారంలో అందంగా రూపొందిస్తారు. పూలను తాంబాళంలో పేర్చి మధ్యలో గౌరమ్మను ప్రతిష్ఠించి పూజించడం అనేక ప్రాంతాల్లో కనిపించే సంప్రదాయం. సాయంత్రం మహిళలు బతుకమ్మ చుట్టూ వలయంగా నిలబడి పాటలు పాడుతూ ఆడటం ద్వారా సామూహిక జీవన స్ఫూర్తిని చాటుతారు.

తొమ్మిది రోజుల ప్రత్యేకత

బతుకమ్మ పండుగ తొమ్మిది రోజుల పాటు కొనసాగుతుంది. మహాలయ అమావాస్య లేదా పితృ అమావాస్యతో ప్రారంభమై సద్దుల బతుకమ్మతో ముగుస్తుంది. ప్రతి రోజూ ప్రత్యేకమైన నైవేద్యం, ఆచారం, పూజా విధానం ఉండటం ఈ పండుగ ప్రత్యేకత. కేంద్ర పర్యాటక శాఖ ఆధారిత సమాచారంలో కూడా తొమ్మిది రోజుల బతుకమ్మకు ప్రతిరోజూ ప్రత్యేక నైవేద్య సంప్రదాయం ఉందని పేర్కొనబడింది. తెలంగాణ ప్రభుత్వ భూపాలపల్లి జిల్లా అధికారిక సమాచారం ప్రకారం తొమ్మిది రోజుల పేర్లు వరుసగా ఎంగిలిపూల బతుకమ్మ, అటుకుల బతుకమ్మ, ముద్దపప్పు బతుకమ్మ, నానబియ్యం బతుకమ్మ, అట్ల బతుకమ్మ, అలిగిన బతుకమ్మ, వేపకాయల బతుకమ్మ, వెన్నముద్దల బతుకమ్మ, సద్దుల బతుకమ్మగా ఉన్నాయి.

ఈ పేర్లు బతుకమ్మ పండుగకు అనుబంధంగా ఉన్న నైవేద్యాలు, స్థానిక ఆచారాలు, కుటుంబ జీవన విధానాన్ని ప్రతిబింబిస్తాయి. కాబట్టి వీటిని తక్కువ చేసి చూడటం కంటే వాటి వెనుక ఉన్న సాంస్కృతిక అర్థాన్ని అర్థం చేసుకోవడం, ప్రాంతీయ భేదాలను గౌరవించడం అవసరం.

స్త్రీ శక్తికి ప్రతీక...

బతుకమ్మ ప్రధానంగా మహిళల పండుగగా కొనసాగుతోంది. పెళ్లైన మహిళలు, యువతులు, బాలికలు తమ కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మను పేర్చి పూజించడం, సాంప్రదాయ దుస్తులు ధరించడం, పాటలు పాడటం, సమూహంగా నృత్యాలు చేయడం ద్వారా స్త్రీల సామూహిక ఐక్యతను చాటుతారు. పెళ్లైన ఆడపిల్లలు పండుగకు పుట్టింటికి రావడం కూడా బతుకమ్మలోని ఆత్మీయతకు మరో ఉదాహరణగా భావిస్తారు. ఈ సందర్భంగా అక్కాచెల్లెళ్లు, తల్లీకూతుళ్లు, బంధువులు, ఇరుగుపొరుగు మహిళలు ఒకే వేదికపై కలుసుకోవడం కుటుంబ, సామాజిక బంధాలను మరింత బలోపేతం చేస్తుంది. ప్రభుత్వ పర్యాటక శాఖ సైతం బతుకమ్మను మహిళల సామూహిక జీవనం, సోదరీభావం, ప్రకృతితో అనుబంధానికి ప్రతీకగా వివరిస్తోంది.

బతుకమ్మ పాటల్లో తెలంగాణ చరిత్ర

బతుకమ్మ పాటలు ఈ పండుగకు మరో ప్రధాన సాంస్కృతిక సంపద. పురాణాలు, చారిత్రక సంఘటనలు, గ్రామీణ జీవనం, కుటుంబ సంబంధాలు, మహిళల అనుభవాలు, సామాజిక పరిస్థితులు వంటి అనేక అంశాలు బతుకమ్మ పాటల్లో ప్రతిఫలిస్తాయి. తెలంగాణ ప్రభుత్వ భాషా-సాంస్కృతిక సమాచారంలో కూడా బతుకమ్మ పాటలకు పురాణాలు, చరిత్రతో పాటు సమకాలీన సామాజిక, రాజకీయ పరిణామాల వరకు అనుబంధం ఉందని తెలిపింది. కాబట్టి బతుకమ్మ పాటలను కేవలం పండుగ పాటలుగా కాకుండా తెలంగాణ ప్రజల మౌఖిక సాహిత్య సంపదగా కూడా చూడాలి. తరతరాలుగా మహిళల ద్వారా ఒక తరం నుంచి మరో తరానికి చేరుతున్న ఈ పాటలు తెలంగాణ గ్రామీణ సంస్కృతికి జీవంతమైన ఆధారాలుగా నిలుస్తున్నాయి.

నీరు,నేల,మనిషి మధ్య అనుబంధం

బతుకమ్మకు పర్యావరణ పరంగా కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. తెలంగాణ ప్రభుత్వ అధికారిక సమాచారం ప్రకారం బతుకమ్మ భూమి, నీరు, మనిషి మధ్య ఉన్న సహజ సంబంధాన్ని ప్రతిబింబిస్తుంది. బతుకమ్మలో ఉపయోగించే అనేక పూలకు ఔషధ గుణాలు ఉన్నాయని, పూలను నీటిలో నిమజ్జనం చేయడం సంప్రదాయంలో భాగమని అధికారిక సమాచారం పేర్కొంటోంది. చెరువులు, కుంటలు, వాగులు తెలంగాణ గ్రామీణ జీవనానికి ఆధారం. అందుకే బతుకమ్మను నీటిలో నిమజ్జనం చేసే సంప్రదాయం ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధాన్ని సూచిస్తుంది. పండుగ ద్వారా చెరువులు, నీటి వనరులు, ప్రకృతి సంపద పట్ల ప్రజల్లో అవగాహన పెరగడం కూడా దీని ప్రత్యేకత.

సద్దుల బతుకమ్మ – మహోత్సవ ముగింపు



తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మ పండుగకు పరాకాష్ట. ఈ రోజున పెద్ద బతుకమ్మను ప్రత్యేకంగా తయారు చేసి, మహిళలు పెద్ద సంఖ్యలో ఒకచోట చేరి పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ వేడుక నిర్వహిస్తారు. అనంతరం బతుకమ్మను సమీపంలోని చెరువు లేదా నీటి వనరులో నిమజ్జనం చేస్తారు. ఐదు రకాల సద్దులతో నైవేద్యం సమర్పించే సంప్రదాయం కూడా ఉంది.

బతుకమ్మను గౌరవిద్దాం..

సంప్రదాయాన్ని కాపాడుకుందాం

బతుకమ్మకు ఏ పేరు పెట్టాలి, ఏ విధంగా సంబోధించాలి అనే విషయంలో ప్రాంతీయంగా, కుటుంబ సంప్రదాయాల పరంగా భిన్నమైన ఆచారాలు ఉండవచ్చు. "బతుకమ్మ తల్లి" అనే గౌరవ సంబోధన భక్తి భావనను వ్యక్తం చేస్తుంది. అయితే బతుకమ్మకు సంబంధించిన ప్రాచీన, ప్రాంతీయ ఆచారాలను తిరస్కరించకుండా వాటి వెనుక ఉన్న సాంస్కృతిక అర్థాన్ని తెలుసుకోవడం మరింత సముచితం.

బతుకమ్మను కేవలం పూలను పేర్చే పండుగగా కాకుండా తెలంగాణ ఆత్మ, మహిళల ఐక్యత, ప్రకృతి ఆరాధన, పల్లె జీవన విధానం, వ్యవసాయ సంస్కృతి, జానపద సాహిత్యం, నీటి వనరుల పరిరక్షణకు ప్రతీకగా భావించాలి. తెలంగాణ రాష్ట్రం కూడా బతుకమ్మను తన సాంస్కృతిక గుర్తింపులో ఒక ముఖ్యమైన ప్రతీకగా గుర్తిస్తోంది.

తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను గౌరవిస్తూ, వాటి అసలు సాంస్కృతిక నేపథ్యాన్ని భావితరాలకు తెలియజేయడం మనందరి బాధ్యత. పూలలో ప్రకృతిని, పాటల్లో చరిత్రను, మహిళల వలయంలో ఐక్యతను, బతుకమ్మలో తెలంగాణ ఆత్మను దర్శిస్తూ ఈ మహోన్నత పండుగను మరింత గౌరవంగా జరుపుకుందాం.

బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా మరింత వెలుగొందాలి.

బతుకమ్మ తల్లి ఆశీస్సులతో ప్రతి ఇంటా జీవన సౌభాగ్యం గుబాళించాలి.



-డా.పల్లె రవి వంశీ మోహన్
ఎడిటర్ & యండీ
అక్షరశక్తి



మోడల్ స్కూల్‌లో ఘనంగా 'మా బడి బతుకమ్మ'

అక్షరశక్తి, శంకరపట్నం: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో శుక్రవారం 'మా బడి బతుకమ్మ' సంబరాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కే. ప్రభాకర్ దీపం వెలిగించి, కొబ్బరికాయ కొట్టి వేడుకలను ప్రారంభించారు. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులు తరగతుల వారీగా రూపొందించిన బతుకమ్మలను పాఠశాల ప్రాంగణంలో అందంగా అలంకరించారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు బతుకమ్మ పాటలకు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రభాకర్ మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేయడంతోపాటు వాటి విశిష్టతను భావితరాలకు అందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజు, సతీష్,



శివశంకర్, ఆర్. రజిత, నాగమణి, ఎస్. రజిత, వనజ, రాధ, సంధ్య, రజిని, డా. మహేందర్ కట్కూరి, రమణారెడ్డి, మధుకర్, సంపత్, శంకర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

GUEST COLUMN

అడవి నుంచి ప్రపంచ వేదిక వరకు– భీమయ్యాక్ అస్తిత్వ ప్రయాణం



- డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.
ramkishore.1504@gmail.com

రచయిత్రి గురించి చిరు పరిచయం:

వి. శాంతి ప్రబోధ పుట్టింది వరంగల్‌లో, పెరిగింది ఆదిలాబాద్‌లో, మెట్టింది నిజామాబాద్ జిల్లాలో. ప్రస్తుతం హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. జర్నలిజం చదివినప్పటికీ సామాజిక సేవా రంగాన్ని తన జీవిత పయనంగా ఎంచుకున్నారు. హేమలతా లవణం, లవణం నిర్వహించిన 'సంస్కార్' సంస్థతో కలిసి సుమారు రెండు దశాబ్దాలు పనిచేశారు. ఆ ప్రయాణంలో నిజామాబాద్ జిల్లాలోని అనేక గ్రామీణ మహిళలు, పిల్లల జీవన పరిస్థితులను దగ్గరగా తెలుసుకున్నారు. ఆ అనుభవాల నుంచే ఆమె రచనా ప్రపంచం రూపుదిద్దుకుంది. ఆమె రచనల్లో 'భావవీచికలు', 'జోగిని', 'గడ్డిపువ్వు గుండె సందుక', 'ఆలోచనలో... ఆమె', 'అమర్ సాహసయాత్ర' ముఖ్యమైనవి. బాలల హక్కులు, జోగిని వ్యవస్థ, మహిళల జీవితం, బాలల సమస్యలు వంటి సామాజిక అంశాలు ఆమె రచనల్లో కనిపిస్తాయి. వివిధ పత్రికల్లో కథలు, కవితలు, వ్యాసాలు రాయడంతో పాటు రేడియో ప్రసంగాలు కూడా చేశారు. అందువల్ల శాంతి ప్రబోధ రచనల్లో కేవలం ఊహ మాత్రమే కాకుండా, ప్రత్యక్ష సామాజిక అనుభవం నుంచి వచ్చిన జీవన వాస్తవికత కనిపిస్తుంది. 'భీమయ్యాక్' కూడా ఆ అనుభవ దృష్టికి మరో విస్తరణగా చూడవచ్చు.

అడవి ఒక నేపథ్యం కాదు – ఒక జీవన పాత్ర:

'భీమయ్యాక్' కథ ప్రారంభమే పాఠకుడిని ఆసిఫాబాద్ అడవుల్లోని ఖైరిగూడ కొలాం పోడ్‌లోకి తీసుకెళ్తుంది. వట్టివాగు గలగలలు, అడవి చెట్లు, మట్టిగోడలు, ముగ్గులు, జొన్న రొట్టెల వాసన, ఆవులు, మేకలు, కోళ్లు, వెదురు బుట్టలు—ఇవన్నీ కలసి ఒక ఆదివాసీ జీవన ప్రపంచాన్ని మన కళ్లముందు నిలబెడతాయి. ఇక్కడ ప్రకృతి కేవలం కథకు నేపథ్యం కాదు. అడవే ఒక పాత్ర. వాగే ఒక పాత్ర. మట్టే ఒక పాత్ర. కొలామీల జీవితం ప్రకృతితో విడదీయలేని సంబంధంలో ఉందని రచయిత్రి ప్రారంభ దృశ్యాల నుంచే స్పష్టం చేస్తారు. అడవి వారి ఆహారం మాత్రమే కాదు; వారి సంస్కృతి, విశ్వాసం, ఆర్థిక జీవితం, జ్ఞాపకాలు, అస్తిత్వం అన్నీ దానితో ముడిపడి ఉన్నాయి.

ఈ ప్రకృతి సౌందర్యానికి వ్యతిరేకంగా సింగరేణి ఓపెన్‌కాస్ట్ మైనింగ్ ప్రవేశించడం కథలో ప్రధాన సంఘర్షణను సృష్టిస్తుంది. పచ్చని అడవి క్రమంగా నల్లటి బొగ్గు దిబ్బలుగా మారుతుంది. జొన్న రొట్టెలపై కూడా బొగ్గు పొర పేరుకుపోవడం వంటి చిన్న వివరాల ద్వారా కాలుష్య ప్రభావాన్ని రచయిత్రి బలంగా చూపించారు.

భీమ్ – అమాయక బాలుడి నుంచి అస్తిత్వ యోధుడి వరకు:

కథకు కేంద్రబిందువు భీమ్. మొదట అతను ఏడేళ్ల అమాయక బాలుడు. అడవిలో స్వేచ్ఛగా తిరుగుతూ, వాగునీటిలో చేపలను చూస్తూ, తాతతో పండుగకు వెళ్తూ ఆనందించే బాలుడు. హాస్టల్‌కు పంపినప్పుడు ఆ స్వేచ్ఛ కోల్పోయిన అనుభూతి అతన్ని కలచివేస్తుంది. కిటికీ బయట అడవిని గుర్తుచేసుకుంటూ ఏడవడం అతని అంతరంగాన్ని అద్భుతంగా వ్యక్తీకరిస్తుంది.

అయితే భీమ్ పాత్ర అక్కడే ఆగిపోదు. తన గూడెం నాశనం కావడం, కుటుంబం నిర్వాసితులవడం, తల్లి అనారోగ్యం, తండ్రి మద్యానికి బానిస కావడం వంటి పరిణామాలు అతని బాల్యాన్ని త్వరగా ముగిస్తాయి. మొదట ఆవేశంతో ఆయుధాల వైపు చూసిన భీమ్, తర్వాత విద్య వైపు మళ్లుతాడు. గొడ్డలి నుంచి అక్షరానికి అతని ప్రయాణమే కథలోని అసలు పరిణామం.

విద్య అతనికి ఉద్యోగం కోసం కాదు; తన సమాజాన్ని అర్థం చేసుకోవడానికి, తన హక్కులను తెలుసుకోవడానికి ఒక ఆయుధంగా మారుతుంది. పర్యావరణ, సామాజిక శాస్త్రాలను అభ్యసించి పరిశోధకుడిగా ఎదగడం ఈ పాత్ర పరిణామానికి సహజమైన ముగింపు.

జైతు – తరతరాల జ్ఞానానికి ప్రతీక:

భీమ్ తాత జైతు కథలో అత్యంత గుర్తుండిపోయే పాత్ర. అతను కేవలం కుటుంబ పెద్ద కాదు. అడవితో సహజీవనం చేసిన తరాల జ్ఞాపకానికి ప్రతినిధి.

"అడవి మన ఇల్లు. ఇదే మన జీవనం. మన సంస్కృతి" అనే అతని ఆలోచన కథకు తాత్విక పునాది. భూమిని ఆస్తిగా కాకుండా తల్లిగా చూడాలనే భావనను జైతు భీమ్‌కు అందిస్తాడు. అయితే కథలో అతని గొప్ప పాత్ర మరొకటి. కేవలం భావోద్వేగంతో పోరాడటం కాకుండా చదువు, చట్టం, అక్షరాన్ని ఆయుధాలుగా మార్చుకోవాలని భీమ్ జీవితానికి దిశ చూపిస్తాడు. చివర్లో భీమ్ చేతిలో 'పెసా' చట్టం పుస్తకం ఉండటం యాదృచ్ఛికం కాదు. అది జైతు ఇచ్చిన జ్ఞానానికి ఆధునిక రూపం.

జంగుబాయి – వ్యక్తిగత మమకారాన్ని దాటిన తల్లి:

భీమ్ తల్లి జంగుబాయి పాత్ర కథలో భావోద్వేగ కేంద్రం. కొడుకు తన దగ్గరే ఉండాలని కోరుకునే తల్లి అయినప్పటికీ, అతని భవిష్యత్తు కోసం హాస్టల్‌కు పంపుతుంది. చివర్లో తీవ్ర అనారోగ్యంతో ఉన్నప్పటికీ ప్రపంచ సదస్సుకు వెళ్లమని కొడుకును ప్రోత్సహిస్తుంది.

"నా శరీరాన్ని రోగం మింగేసింది. కానీ మన గూడెం పిల్లల భవిష్యత్తును ఆ బొగ్గు రాక్షసుడు మింగకుండా ఉండాలంటే నువ్వు వెళ్లాలి" అనే ఆమె భావన వ్యక్తిగత తల్లితనాన్ని సామూహిక తల్లితనంగా విస్తరింపజేస్తుంది.

శిల్పం, కథన శైలి:

కథనంలో రచయిత్రి ప్రధానంగా దృశ్యాత్మక వర్ణన, సంభాషణ, జ్ఞాపకం, అంతర్మథనం, సంఘటనల క్రమం వంటి పద్ధతులను ఉపయోగించారు. మొదటి భాగంలోని ప్రకృతి వర్ణన చాలా జీవంతో ఉంటుంది. పాఠకుడు అడవిని కేవలం చదవడు; వాగు శబ్దాన్ని వింటున్నట్లు, జొన్న రొట్టెల వాసనను ఆస్వాదిస్తున్నట్లు అనిపిస్తుంది. కథా శిల్పంలో మరో ముఖ్యమైన అంశం విరుద్ధత. ఒకవైపు పచ్చని అడవి; మరోవైపు నల్లటి బొగ్గు దిబ్బలు. ఒకవైపు వాగునీరు; మరోవైపు బొగ్గు వ్యర్థాలతో కలుషితమైన నీరు. ఒకవైపు కొలాం పోడ్ స్వేచ్ఛ; మరోవైపు హాస్టల్ గోడలు. ఒకవైపు మూలవాసి సంస్కృతి; మరోవైపు కార్పొరేట్ ఆధునికత. ఈ విరుద్ధతల ద్వారానే కథలోని సంఘర్షణ మరింత స్పష్టమవుతుంది.

అయితే కథ రెండో భాగంలో, ముఖ్యంగా సిడ్నీ సదస్సు ప్రాంతంలో, కథనం కొంతవరకు ఉపన్యాస ధోరణి సంతరించుకుంటుంది. పాత్రల జీవన సంఘర్షణ కంటే రచయిత్రి చెప్పాలనుకున్న సామాజిక సందేశం కొన్ని సందర్భాల్లో ముందుకు వస్తుంది. భీమ్ విద్యార్థి నుంచి అంతర్జాతీయ పరిశోధకుడిగా ఎదిగే దశను మరింత విస్తరించి ఉంటే పాత్ర పరిణామం ఇంకా సహజంగా, బలంగా ఉండేది.

సిడ్నీ – స్థానిక పోరాటానికి ప్రపంచ విస్తృతి:

ఆస్ట్రేలియా ప్రయాణం కథలో కొత్త అధ్యాయాన్ని తెరుస్తుంది. ఆస్ట్రేలియన్ అబోరిజినల్స్ జీవితం, వారి కళ, సంగీతం, సంప్రదాయాలు భీమ్ తన కొలాం సంస్కృతితో పోల్చుకుంటాడు. డిడ్జెరిడూ సంగీతం వింటూ తన గూడెం గుర్తుకు రావడం, జాకరోను చూసి తన సోదరుడిలా భావించడం కథలోని మానవీయతను పెంచుతుంది.

ఇక్కడ రచయిత్రి ఒక ముఖ్యమైన భావనను ముందుకు తెస్తారు: ప్రాంతాలు మారినా, భాషలు మారినా, ప్రపంచంలోని అనేక మూలవాసుల సమస్యల మూలాల్లో భూమి కోల్పోవడం, ప్రకృతి విధ్వంసం, సంస్కృతి అంతరించడం, అధికార-ఆర్థిక శక్తుల ఒత్తిడి వంటి సామ్యాలు ఉన్నాయి. అందువల్ల భీమ్ పోరాటం ఖైరిగూడకే పరిమితం కాదు. అది ప్రపంచ మూలవాసుల అస్తిత్వ సమస్యతో అనుసంధానమవుతుంది.

ప్రతీకల బలం:

కథలో అనేక ప్రతీకలు ఉన్నాయి. అడవి జీవనానికి ప్రతీక. వాగు నిరంతర జీవప్రవాహానికి ప్రతీక. బొగ్గు పొగ విధ్వంసక అభివృద్ధికి ప్రతీక. గొడ్డలి మొదటి దశలోని ఆవేశపూరిత ప్రతిఘటనకు ప్రతీక. పుస్తకం, అక్షరం, పెసా చట్టం జ్ఞానంతో కూడిన ఆధునిక పోరాటానికి ప్రతీకలు.

ముఖ్యంగా కథ ప్రారంభంలో స్వచ్ఛమైన వాగునీరు, ముగింపులో బొగ్గు వ్యర్థాలతో నల్లటి రక్తంలా మారిన వాగు—ఈ రెండు దృశ్యాల మధ్య ఉన్న వ్యత్యాసమే కథ మొత్తాన్ని ప్రతిబింబిస్తుంది.

సామాజిక దృష్టి:

రచయిత్రి శాంతి ప్రబోధ సామాజిక దృష్టి స్పష్టంగా అణగారిన సమాజాల పక్షాన నిలిచే దృష్టి. ఆదివాసీలను కేవలం అభివృద్ధి లబ్ధిదారులుగా చూడకుండా, తమ భూమి, అడవి, సంస్కృతిపై హక్కు కలిగిన సమాజంగా చూపించారు. అభివృద్ధి పేరుతో జరిగే మైనింగ్ వల్ల కలిగే పర్యావరణ నష్టం మాత్రమే కాదు, నిర్వాసితత్వం, మద్యం, ఆరోగ్య సమస్యలు, కుటుంబాల విచ్ఛిన్నం, సాంస్కృతిక నష్టం వంటి అనేక సామాజిక పరిణామాలను కథ కలిపి చూపుతుంది. అందుకే 'భీమయ్యాక్' పర్యావరణ కథ మాత్రమే కాదు; ఇది అస్తిత్వ కథ, నిర్వాసితుల కథ, ఆదివాసీ హక్కుల కథ, విద్య ద్వారా చైతన్యానికి చేరిన ఒక తరపు కథ.

ముగింపు – తిరిగి వచ్చిన భీమ్:

కథ చివరి దృశ్యం మొత్తం కథకు తాత్విక ముగింపు ఇస్తుంది. నల్లటి బొగ్గు పొగ మధ్య నుంచి వాగు గలగలలు భీమ్‌కు వినిపిస్తాయి. నీటిని తాకడానికి ప్రయత్నించి వెనక్కి తీసుకున్న అతని చేయి, కేవలం కలుషిత నీటిని తాకలేకపోవడం కాదు; గతాన్ని మళ్లీ అదే రూపంలో స్వీకరించలేని స్థితికి చేరిన అతని చైతన్యానికి ప్రతీక. ఒకప్పుడు అడవిని వదిలి నగర ప్రపంచం వైపు వెళ్లాలనుకున్న భీమ్, ఇప్పుడు ప్రపంచాన్ని చూసి తన అడవికి తిరిగి వస్తాడు. అతను ఓడిపోయి తిరిగి రావడం లేదు. తెలుసుకుని, నేర్చుకుని, ప్రపంచాన్ని అర్థం చేసుకుని, తన మూలాల విలువను గుర్తించి తిరిగి వస్తున్నాడు.

అందుకే 'భీమయ్యాక్' ముగింపు భీమ్ వ్యక్తిగత విజయంతో ముగియదు. అది ఒక ప్రశ్నను మన ముందుంచుతుంది: అభివృద్ధి కోసం మనం ఏమి కోల్పోతున్నాం? భూమిని కోల్పోతే కేవలం ఒక ఆస్తినే కోల్పోతున్నామా? అడవిని కోల్పోతే కేవలం చెట్లనే కోల్పోతున్నామా? లేక ఒక సంస్కృతి, ఒక భాష, ఒక జీవన విధానం, ఒక మానవ నాగరికతను కోల్పోతున్నామా? ఈ ప్రశ్నలకు సమాధానం వెతికేలా పాఠకుడిని వెంటాడే కథగా 'భీమయ్యాక్' నిలుస్తుంది. అడవిని కాపాడటం అంటే కేవలం చెట్లను కాపాడటం కాదు; ఆ అడవితో కలిసి బతికిన మనుషుల చరిత్రను, సంస్కృతిని, అస్తిత్వాన్ని కాపాడటమని ఈ కథ గుర్తుచేస్తుంది.

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.

రామప్పకు ముప్పు!

రామప్ప ఆలయానికి సమీపంలో సింగరేణి ఓపెన్‌కాస్ట్ గని

- ఐదు కిలోమీటర్ల దూరంలో 300 మీటర్ల లోతు బొగ్గు తవ్వకాలు
- యునెస్కో గుర్తింపు పొందిన చారిత్రక ఆలయంపై ఓపెన్‌కాస్ట్ నీడ
- భూగర్భజలాల మార్పులతో చెరువు కట్టకు ప్రమాదం?
- పునాదుల్లో ఇసుక కొట్టుకుపోతే ఆలయ స్థిరత్వానికి ముప్పు
- 80 వేల ఎకరాల సాగు.. వేలాది కుటుంబాల జీవనాధారంపై ఆందోళన
- రానున్న కాలంలో కంటికి కనిపించని జీవన విధ్వంసమే..
- ప్రభుత్వాలు స్పందించాలి.. గనిని నిలిపివేయాలి
- ప్రాఫెసర్ పాండురంగారావు

ములుగు జిల్లా, వెంకటాపూర్ మండలంలోని పాలంపేటలో కాకతీయులు నిర్మించిన చారిత్రక దేవాలయం రామప్ప (రుద్రేశ్వర ఆలయం). కాకతీయులు నిర్మించిన ఆలయాల్లో రామప్ప అత్యద్భుతం. ఆ నాటి ఇంజినీరింగ్, శిల్ప కళా నైపుణ్యానికి నిలువెత్తు నిదర్శనం. సుమారు క్రీస్తు శకం 1213 సంవత్సరంలో ప్రారంభించి, 40 ఏళ్లపాటు దీనిని నిర్మించారు. రామప్ప ఆలయం యునెస్కో(UNESCO) గుర్తింపు పొంది, మన ఓరుగల్లు కీర్తిని విశ్వవ్యాప్తం చేసింది. ఆలయానికి సమీపంలోనే నిర్మించిన రామప్ప చెరువు 8 శతాబ్దాలుగా సాగునీరు అందిస్తోంది. ప్రత్యక్షంగా 30వేల ఎకరాలు, పరోక్షంగా మరో 50వేల ఎకరాలు.. అంటే మొత్తం సుమారు 80వేల ఎకరాలకు సాగునీరు అందిస్తోంది. ఇంత గొప్ప వారసత్వ సంపద నేడు ప్రమాదంలో పడిపోతోంది. సింగరేణి కాలరీస్ చేపడుతున్న ఓపెన్ కాస్ట్ గనితో ధ్వంసంకాబోతోంది. చూస్తుండగానే రామప్ప ఆలయం, రామప్ప చెరువు కనుమరుగయ్యే పరిస్థితుల్లో పడిపోతోంది.. అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు కాకతీయ హెరిటేజ్ ట్రస్టీ, ఇన్‌టాక్(INTACH) వరంగల్ చాప్టర్ కన్వీనర్, వరంగల్ నిట్(NITW) రిటైర్డ్ ప్రాఫెసర్ ఎం. పాండురంగారావు. ఆలయానికి కేవలం ఐదు కిలోమీటర్ల దూరంలోనే సింగరేణి కాలరీస్ చేపడుతున్న ఓపెన్‌కాస్ట్ మైన్‌తో రామప్ప ఆలయంతోపాటు రామప్ప చెరువుకు ప్రమాదం పొంచి ఉందంటూ ఆయన హెచ్చరిస్తున్నారు. ఓపెన్ కాస్ట్ మైన్ ఆపివేయాలంటూ 85ఏళ్ల వయస్సులోనూ ఆయన పోరాడుతున్నారు. ఈ నేపథ్యంలోనే డిజిటల్ మీడియా ప్రతినిధులతో పాండురంగారావు ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే... - అక్షరశక్తి, ప్రధానప్రతినిధి



కంటికి కనిపించని విధ్వంసం..

రామప్ప ఆలయం, చెరువుకు సమీపంలో చేపడుతున్న సింగరేణి ఓపెన్ కాస్ట్ గనితో మన కంటికి కనిపించని జీవన విధ్వంసం జరగబోతోంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 80వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్న రామప్ప చెరువు, ఓరుగల్లు కీర్తిని విశ్వవ్యాప్తం చేసిన రామప్ప ఆలయం ధ్వంసం కాబోతున్నాయి. సుమారు 20 గ్రామాల ప్రజలు, వారి జీవనాధారం ప్రమాదంలో పడిపోతున్నాయి. మొత్తంగా ఓ అద్భుతమైన జీవనచిత్రం కనుమరుగు కాబోతోంది. ఈ నేపథ్యంలోనే ఈ ప్రాంత ప్రజలు కూడా ఓపెన్‌కాస్ట్ గనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. తమ బతుకులు ఛిద్రమైపోతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వారసత్వ సంపద పరిరక్షణ కోసం మేం కూడా దశాబ్దాలుగా పరిశోధన చేస్తున్నాం. ఇప్పుడు ఉద్యమిస్తున్నాం.



జీఎస్ఐ హెచ్చరికలు..

అయితే.. ఇక్కడ ఒక విషయాన్ని మనం గమనించాల్సి అవసరం ఉంది. జీఎస్ఐ(Geological Survey of India GSI) అనుమతులు ఇచ్చినా.. కొన్ని కీలకమైన హెచ్చరికలు కూడా చేసింది. ఈ హెచ్చరికలు చాలు.. మన వారసత్వ సంపద అయిన రామప్ప ఆలయంతోపాటు రామప్ప చెరువు ఎంతటి ప్రమాదంలో పడిపోతున్నాయో..! * రామప్ప చెరువులోని నీటి మట్టం, ఈ భౌగోళిక చీలికలు, రాతి పొరల మధ్యనున్న జాయింట్ల ద్వారా భూగర్భజలాలు ప్రవహించే తీరుపై ప్రభావం చూపుతుంది. దీనివల్ల నీటి ప్రవాహానికి సంబంధించిన హైడ్రాలిక్ గ్రేడియంట్‌లో మార్పులు చోటుచేసుకోవచ్చు. వెంకటాపూర్ గ్రామంలో ప్రతిపాదించిన 300 మీటర్ల లోతైన ఓపెన్‌కాస్ట్ గని వరకు ఈ ప్రభావం విస్తరించే అవకాశం ఉంది * అని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) తన నివేదికలో పేర్కొంది. రెండు కొండలను కలుపుతూ మట్టి కట్టతో రామప్ప చెరువును నిర్మించారు. ఈ చెరువు కట్టలోకి నీటి చొరబాటును అడ్డుకునే కట్ ఆఫ్ ట్రెంచ్ (సీవోటీ) లేదు. రామప్ప చెరువుకు దిగువన 300 మీటర్ల లోతుతో ఓపెన్‌కాస్ట్ గనిని తవ్వడం వల్ల భూగర్భంలో నీటి పీడన పరిస్థితులు మారే అవకాశం ఉంటుంది. గని ప్రాంతంలో నీటి పీడనం(హైడ్రాలిక్ గ్రేడియంట్) తక్కువైతే, చెరువు నుంచి భూగర్భంలోని పగుళ్లు, రాతి పొరల మధ్య ఖాళీల నుంచి నీరు ఆ వైపునకు వేగంగా ప్రవహించే ప్రమాదం ఉంది. దీనివల్ల ఏర్పడిన బుంగలతో క్రమంగా చెరువు కట్ట దెబ్బతింటుంది. ఇది మన కళ్లకు కనిపించకుండా జరిగే భయంకరమైన జీవన విధ్వంసం.





ప్రమాదంలో ఆలయ పునాది...

రామప్ప దేవాలయ పునాది నిర్మాణంలో శాండ్‌బాక్స్(ఇసుక పెట్టె) పద్ధతి ఉపయోగించారు. అంటే ఇక్కడ పరిమిత ఇసుక మాత్రమే ఉంటుంది. ఓపెన్ కాస్ట్ మైన్‌తో చెరువు దిగువకు భూగర్భ జలాల ప్రవాహం పెరుగుతుంది. భూగర్భ జలాల ప్రవాహం కారణంగా ఆలయ పునాదుల్లోని ఇసుక, మట్టి రేణువులు కొట్టుకుపోయి (పైపింగ్ ఫినామినా - Piping Phenomenon) అంతర్గత ఖాళీలు ఏర్పడుతాయని, దీనివల్ల రామప్ప దేవాలయ పునాది స్థిరత్వానికి ముప్పు ఏర్పడే ప్రమాదం ఉంది అని జీఎస్ఐ తన నివేదికలో హెచ్చరించింది. అంటే రామప్ప చెరువు, దేవాలయం గుండా పరస్పరం అనుసంధానమై విస్తరించిన భౌగోళిక చీలికల వెంట నీరు ప్రవహించడం వల్ల రామప్ప ఆలయ పునాదిగా ఉన్న ఈ ఇసుక పెట్టె నిర్మాణం బలహీన పడుతుంది. రామప్ప దేవాలయంపై పేలుళ్ల ప్రభావం ప్రస్తుతం తక్కువగానే ఉండవచ్చని నివేదికలు సూచిస్తున్నప్పటికీ, దీర్ఘకాలంలో పదేపదే సంభవించే ప్రకంపనలు దేవాలయంపై తీవ్ర ప్రభావాన్ని చూపే ప్రమాదం ఉంది. నిరంతర పేలుళ్లతో కాలక్రమేణా తీవ్ర నష్టం జరుగుతుంది. అలాగే, ఓపెన్‌కాస్ట్ గనితో ఏర్పడే కాలుష్యంతో ఆలయంపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుంది. ఓపెన్ కాస్ట్ గని ప్రక్రియతో ఏర్పడే ప్రతికూల పరిస్థితుల్లో ఆలయ గుర్తింపును యునెస్కో రద్దు చేసే అవకాశమూ లేకపోలేదు. ఈ నేపథ్యంలోనే ఓపెన్‌కాస్ట్ గనిని ఆపివేయాలి. ఈ మేరకు ప్రభుత్వాలు చొరవతీసుకోవాలి.

ప్రభుత్వాలు స్పందించాలి..

సింగరేణి వెంకటాపురం వద్ద ఓపెన్‌కాస్ట్ గని ప్రారంభించేందుకు ప్రయత్నాలు చేస్తున్న ప్పటి నుంచే మేము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. 2023 మార్చి 1న ములుగు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన సమావేశం, 2023 మార్చి 28న కలెక్టర్ నుంచి వచ్చిన లేఖ, అదే ఏడాది ఏప్రిల్ 1న మేము పంపిన లేఖ, 2024 డిసెంబరు 19న జరిగిన సమావేశం వంటి అంశాలను 2025 జనవరి 27న కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డికి పంపిన లేఖలోనూ ఓపెన్‌కాస్ట్‌తో జరిగే ప్రమాదాలను వివరించాం. రామప్ప ఆలయం, సరస్సుకు గని వల్ల కలిగే ప్రమాదాలపై మా అభ్యంతరాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాం. 2026 అక్టోబరు 3న సింగరేణి సీఎండీకి కూడా కూడా లేఖ రాసి, గని ప్రతిపాదన ప్రభావాలను వివరించేందుకు వ్యక్తిగతంగా కలిసే అవకాశం ఇవ్వాలని కోరాను. రామప్ప ఆలయం, రామప్ప చెరువు భద్రతకు ముప్పు కలిగించే ఈ ప్రతిపాదనపై తొందరపాటు నిర్ణయం తీసుకోవద్దు. కాకతీయులు అందించిన వారసత్వ సంపదను కాపాడడానికి ప్రభుత్వాలు ముందుకు రావాలి. రామప్ప ఆలయానికి, సరస్సుకు ముప్పు తెచ్చే ఓపెన్‌కాస్ట్ గనిని ఆపివేయాలి.



భావితరాలకు అందిద్దాం..

ఈ ఓపెన్ కాస్ట్ మైన్, మనకు కాకతీయులు అందించిన గొప్ప వారసత్వ సంపద రామప్ప ఆలయానికి, రామప్ప చెరువుకు కేవలం ఐదు కిలోమీటర్ల దూరంలోనే ఉంది. దీంతో రామప్ప ఆలయంతోపాటు చెరువు ప్రమాదంలో పడిపోతున్నాయి. ఓపెన్ కాస్ట్ మైన్‌లో బొగ్గు తవ్వకాల కోసం చేపట్టబోయే భారీ పేలుళ్లతో రామప్ప ఆలయం, చెరువు ధ్వంసమయ్యే ప్రమాదం ఉంది. ఇది ఒక్కరోజే.. ఒకేసారి జరగదు. భారీ పేలుళ్లతో మొదలయ్యే విధ్వంసం రోజులు, నెలలు, సంవత్సరాలు గడిచేకొద్దీ మనకు అర్థం అవుతుంది. మొదట్లోనే మనం మేల్కోకపోతే.. మన కళ్లముందే జరగాల్సిన విధ్వంసం జరిగిపోతుంది. మన ప్రజలకు, మన భావితరానికి ఊహకందని నష్టం జరుగుతుంది. అందుకే.. ఓపెన్ కాస్ట్ మైన్ ప్రారంభం కాకముందే.. మనం మేల్కోవాలి. జాగ్రత్తపడాలి. అద్భుతమైన వారసత్వ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. మన భావితరాలకు అందించాల్సిన అవసరం ఉంది. లేదంటే.. ఆ సంపదను, ఆ ఇంజినీరింగ్ నైపుణ్యాన్ని, ఆ శిల్పకళావైభవాన్ని మన భావితరాలు చూడలేవు. ఈ విషయాన్ని మనం గుర్తుంచుకొని ముందుకు వెళ్లాలి. కలిసి కదలాలి..!

